ఈ దారిద్ర్యం.. ఇంకెన్నాళ్లు!

గ్రాండ్ సాక్షి రిపోర్ట్

- కూటమి గొప్పలు...కానరాని చేతలు
- దయనీయంగా రహదారుల దుస్థితి
- రోడ్ల అభివృద్ధిని గాలికొదిలేసిన ప్రభుత్వం
- గత ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్లకూ నిధులివ్వని వైనం

సంక్రాంతి నాటికల్లా.. రోడ్ల నిర్మాణం, గుంతలు పూడ్చివేత పనులు పూర్తి చేస్తాం...రోడ్లను అద్దంలా మారుస్తాం...ఇదీ కూటమి ప్రభుత్వం చెప్పుకున్న గొప్పలు. నేతల మాటలు కోటలు దాటాయి...కానీ చేతలు మాత్రం గడప దాటలేదు. సంక్రాంతి వెళ్లి పోయింది...ఉగాది కూడా వెళ్లిపోయింది...నెలలు గడిచిపోయాయి...కానీ రహదారి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి...కొన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం పూర్తిగా గాలికొదిలేసింది. కొన్ని గ్రామాల్లో వేసిన రోడ్లు, పూడ్చిన గుంతలు నాసి రకంగా ఉన్నాయి..ఇప్పుడే ఇలా ఉంటే...ఇక రానున్న వర్షాకాలంలో రోడ్ల పరిస్థితి ఏమిటో అని జనం నిట్టూరుస్తున్నారు..



తాండవ రిజర్వాయరకు వెళ్లే రోడ్డు శిథిలం కావడంతో రోడ్డుపై ప్రమాదకరంగా రాళ్లు



నాతవరం తాండవ మధ్య బురదమయంగా రోడ్డు

తాండవ రోడ్డు శిథిలం

నాతవరం : అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో తాండవ ప్రధాన రోడ్డు దుస్థితి ఇది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ తారు రోడ్డుకు కనీసం మరమ్మతులు సైతం చేపట్టలేకపోయారు. నాతవరం గ్రామం నుంచి తాండవ రిజర్వాయరు రోడ్డు సుమారుగా 7కిలో మీటర్లు ఉంటుంది. ఈ రోడ్డు తాండవ రిజర్వాయరుకు వెళ్లడానికి, అలాగేమూడు మండలాలను కలిపే ప్రధాన రోడ్డు. ఈ రోడ్డుపై ఆధారపడి నాతవరం మండలంలో చమ్మచింత, గంటావారి కొత్తగూడెం, మాధవనగరం, తాండవ, జాలారిపేట, ఉలమల్ల, తాళ్లపాలెం, పాట్టినాగన్నదొరపాలెం గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఈ రోడ్డే ప్రధానాధారం. తర్వాత గొలుగొండ మండలం వెళ్లడానికి చాలా దగ్గర దారి. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలానికి కూడా దగ్గర దారి. ఈ మండలంలో ఆడాకుల, కంఠారం, రొంగలి కొత్తూరు, బాలారం, మాడుగుల తదితర గ్రామాలకు ఈ రోడ్డే ప్రధాన మార్గం. ఈ రోడ్డు పెద్ద గోతులు పడి ప్రమాదకంగా మారింది.ఏ మాత్రం వర్షం పడినా రోడ్డంతా బురదమయం అవుతుంది. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎన్నికల సమయంలో రోడ్డుపై ఎన్నో హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు దుస్థితిని కన్నెత్తి చూడలేదు. ఈ రోడ్డు సమస్యపై ఈ ప్రాంత నాయకులు స్పీకరు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. శిథిలమైన తాండవ రోడ్డును ఇప్పటికైనా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



రొంగలినాయుడుపాలెం-గొండుపాలెం గ్రామాల మధ్య ఛిద్రమైన రోడ్డు

అడుగడుగునా గోతులు...

కె.కోటపాడు : రొంగలినాయుడుపాలెం-గొండుపాలెం గ్రామాల మధ్య తారురోడ్డు దుస్థితి ఇది. ఈ రెండు గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల మేర తారురోడ్డు పూర్తిగా గోతులతో ఛిద్రమైంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రతి రోజూ ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు నరకం చూస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సంక్రాంతి పండగ సమయానికి రోడ్లకు మరమ్మతు పనులు చేస్తామన్నారు. కానీ రోడ్డు దుస్థితి మారలేదు. అత్యవసర ప్రయాణాలకు చోడవరం, అనకాపల్లి, విశాఖ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గమైన ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సగంలో వదిలేశారు...

మాడుగుల : గత వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు 9 కిలోమీటర్ల మేర రహదారి పొల్సారు రాయి బుగ్గి వేసి చదును చేశారు. దాదాపు సగం పనులు పూర్తి చేశారు. ఎన్నికలు రాగానే పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినాక ఈ రోడ్డును పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం గోతులమయంగా మారిపోయింది. రోడ్డుకు ఇరు వైపులా ఎతుప్పలు పెరిగిపోవడంతో సుమారు 7 గిరి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి సర్కారు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన కొత్తవలస రాజంపేట రహదారి



వాలాబు రోడ్డులో కనుచూపు మేర రాళ్లు తేలిన దృశ్యం

రాళ్లు తేలిన రోడ్డుతో నిత్యం నరకం

దేవరాపల్లి : దేవరాపల్లి నుంచి గిరిజన పంచాయతీ వాలాబు వెళ్లే తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దేవరాపల్లి నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డులో అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో సుమారు 14 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు తరుచూ ఈ మార్గంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి ఒళ్లు హూనం అవుతుంది. వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయి. వాలాబు పంచాయతీలో పరిధిలోని శివారు గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణానికి మెటీరియల్‌ను అధిక లోడుతో ఈ రోడ్డు మీదుగా తీసుకెళ్లడంతో ఈ రోడ్డు ధ్వంసమైంది. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పరిమితికి మించి లోడుతో భారీ వాహనాల్లో మెటీరియల్ తరలించడంతో రోడ్డు దెబ్బతిని ప్రమాదాలకు కారణమవుతోంది. రోడ్డు నిర్మించాలని ఇప్పటికే పలు మార్లు స్థానిక గిరిజనులు కోరినా కూటమి ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. తక్షణమే స్పందించి రోడ్డు పునర్నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఈ రోడ్డెక్కితే...అంతే సంగతులు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం,నర్సీపట్నం(బీఎన్) ప్రధాన రోడ్డులో పెద్దపెద్ద గోతుల్లో వర్షం నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. పెద్దపెద్ద గోతుల్లో నుండి రాకపోకలు సాగించడానికి వాహనదార్లు నరకయాతన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెల రోజుల్లోనే రోడ్లు వేస్తామని,సంక్రాంతి పండగకి ముందే అన్ని గ్రామాల్లో రోడ్లు బాగు చేస్తామన్న కూటమి ప్రభుత్వం కనీసం గోతులను కూడా పూడ్చలేదు. విజయరామరాజుపేట,వడ్డాది,ఎల్‌బీ పురం,బంగారుమెట్ట, లోపూడి,శింగవరం,పీడీ పాలెం తదితర గ్రామాల్లో పెద్దపెద్ద గోతుల్లో వర్షం నీరు చేరి తారురోడ్డు బురద రోడ్డుగా మారింది. పలు చోట్ల గోతుల్లో పడి భారీ వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ఈ గోతులను పూడ్చాలని ఇటీవల పలువురు వ్యాపారులు, ప్రజలు వడ్డాదిలో చేపలు పట్టి నిరసిన వ్యక్తం చేసినా ఆర్‌అండ్‌బీ అధికారులు కానీ, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు కానీ పట్టించుకోలేదు. తక్షణం రోడ్డు గోతులను పూడ్చి రహదారి కష్టాలు తొలగించాలని ఈ రహదారిలో రాకపోకలు సాగించే విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం,చోడవరం, పాడేరు తదితర ప్రాంతాల ప్రయాణికులు కోరుతున్నారు.



విజయరామరాజుపేట వద్ద ఏర్పడిన పెద్దపెద్ద గోతులు



బురదమయంగా మారిన బీఎన్ రోడ్డు



తాచేరు డైవర్షన్ రోడ్డు గోతుల్లో వాహనదారుల అవస్థలు



వడ్డాది బంక్ వద్ద గోతుల మయం

క్లుప్తంగా

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి



కె.కోటపాడులో మండల సమన్వయ కమిటీ సమావేశంలో తహసీల్దార్, ఎస్ఐ

కె.కోటపాడు : సామరస్య పూర్వక వాతావరణంలో సమస్యలను పరిష్కరించుకునేందుకు ఇరువర్గాల వారు ప్రాధాన్యం ఇవ్వాలని తహసీల్దార్ డి.రమేష్‌బాబు, ఎస్ఐ ఆర్.ధనుంజయ్ అన్నారు. కె.కోటపాడు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కె.కోటపాడుకు చెందిన రెండు సమస్యల పరిష్కారానికి ఆయా ఫిర్యాదుదారులతో వీరు సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి సర్వేయర్‌ను పంపించి క్షేత్ర స్థాయిలో నిర్ధారణ చేసే చర్యలు చేపడతామని తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నర్సీపట్నం : డిగ్రీ ఆంధ్రయూనివర్శిటీ ఫలితాల్లో వివేకానంద కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారు. బిఏ గ్రూపులో ఎం.లక్ష్మి ప్రసన్న రాణి 9.23 మార్కులు సాధించి, యూనివర్శిటీ పరిధిలో ప్రథమ ర్యాంకు సాధించింది. వి.ఎల్.మహతి బిఏ గ్రూపులో 8.92 మార్కులతో రెండో ర్యాంకు సాధించింది. వీరిని కళాశాల కరస్పాండెంట్ దొరబాబు, డైరెక్టర్లు సునీల్ కుమార్, సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌వోఆర్ కోర్టు పునఃప్రారంభం



ఇరువర్గాలను విచారిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌వోఆర్(రికార్డ్ ఆఫ్ రైట్స్) కార్యకలాపాలను ఆర్డీవో వి.వి.రమణ శనివారం పునఃప్రారంభించారు. గతంలో ఆర్‌వోఆర్ కోర్టును జాయింట్ కలెక్టర్ జిల్లా కేంద్రంలో నిర్వహించేవారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తిరిగి ఆర్డీవో కార్యాలయంలోనే ఆర్‌వోఆర్ కోర్టు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు కొన్ని సంబంధిత కేసులపై ఆర్డీవో ఇరువర్గాలను విచారించి, వారి వాదనలను విన్నారు. ఇకపై ఆర్‌వోఆర్ కోర్టు జిల్లా కేంద్రంలో కాకుండా నర్సీపట్నంలోనే జరుగుతుందని ఆర్డీవో తెలిపారు.

నాతవరంలో భారీ వర్షం



నాతవరంలో కురుస్తున్న భారీ వర్షం

నాతవరం: మండలంలో శనివారం ఉదయం ఉరుములతో కూడిన వర్షంతో పాటు పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. నాతవరం, గునుపూడి, చమ్మచింత గ్రామాల్లో చెట్లపైన పిడుగులు పడడంతో కొబ్బరి, పామాయిల్ చెట్లు కాలిపోయాయి. భారీ వర్షం కురవడంతో చెరువుల్లో ఓ మోస్తరు నీరు చేరింది. నాతవరం , నర్సీపట్నం, తుని మధ్య అర్‌అండ్‌బీ రోడ్డుపై పలు చోట్ల నీరు ప్రవహించింది. ఈ విధంగా మరిన్ని వర్షాలు కురిస్తే తాండవ రిజర్వాయరులో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంటుందని ప్రాజెక్టు అధికారులు అంటున్నారు.

ఏఎల్ పురం అభివృద్ధికి చర్యలు



వివరాలు తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్

గొలుగొండ : ఏఎల్‌పురం ప్రాంతంలో రైతులకు ఇబ్బందులు లేకుండా స్పీకర్ అయ్యన్నపాత్రుడు చర్యలు తీసుకున్నారని మాజీ జడ్పీటీసీ చిటికెల వేణుగోపాల్ తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 700 ఎకరాల ఆయకట్టుకు ప్రధాన ఆధారం అయిన బంగారంపేట చెక్‌డ్యాం మరమ్మతులు, కాలువ పూడికతీత పనుల కోసం 7 లక్షలు మంజూరు కావడం పనులు పూర్తి కావడంతో ఈ ప్రాంత రైతులకు ఖరీఫ్‌కు ఇబ్బందులు లేవన్నారు. ఏఎల్‌పురం ప్రాంతంలో స్పీకర్ అయ్యన్న సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.2.71 కోట్లు నిధులు మంజూరు చేయడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం జరిగిందని తెలిపారు.

పక్కాగా ఎస్‌హెచ్‌జీ సభ్యుల జీవనోపాధి ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ప్రభాకర్, ఎంఎంఎస్ మండల అధ్యక్షురాలు లావణ్య

దేవరాపల్లి : కుటుంబాల వారీగా ఎస్‌హెచ్‌జీ సభ్యుల జీవనోపాధి ప్రణాళికను (2025-2026) పక్కాగా సిద్ధం చేస్తున్నట్టు వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.లావణ్య అధ్యక్షతన శనివారం మండల మహిళ సమాఖ్య(ఎంఎంఎస్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ప్రభాకర్ మాట్లాడుతూ ఏసీఎల్‌పీ(యాన్యువల్ క్రెడిట్ లైవ్‌లీవుడ్ ప్లాన్) యాప్ ద్వారా ఎస్‌హెచ్‌జీ సభ్యురాలి అవసరాలను గుర్తించి బ్యాంక్ లింకేజీ, అంతర్గత అప్పులు, సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా అవసరమైనంత మాత్రమే రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఉన్నతి ద్వారా ఎస్సీ, ఎస్టీలకు వారి అవసరాలకు అనుగుణంగా సభ్యురాలికి రూ.లక్ష వరకు రుణం అందజేస్తామని, వాయిదాలను సక్రమంగా చెల్లిస్తే వడ్డీ రాయితీ పూర్తి స్థాయిలో వర్తిస్తుందన్నారు. ప్రతి నెలా ఎస్‌హెచ్‌జీ సమావేశం నిర్వహించి ఆర్థిక లావాదేవీలపై చర్చించాలన్నారు. సదరు సమావేశ ప్రదేశాన్ని జియోట్యాగింగ్ చేయడంతో పాటు సభ్యుల ఎఫ్ఆర్‌ఎస్‌ను వీవోఏలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు ఎల్.గౌరీశ్వరరావు, పైడిబాబు, మంగళ, నాయుడు, రాము, అకౌంటెంట్ పార్వతిదేవి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు

కె.కోటపాడు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బెల్ట్‌షాపుల ద్వారా గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయని సీపీఎం నాయకుడు యర్రా దేముడు ఆరోపించారు. కె.కోటపాడులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంఆర్పీ కంటే అధిక ధరలకు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని అన్నారు. బెల్ట్‌షాపులు నియంత్రించాలన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు దరఖాస్తులు

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్)అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. రెండు నెలల పాటు మాకవరపాలెం మండల కేంద్రంలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 44 ఏళ్లలోపు ఉండి, ఇంటర్ ఆపైన చదువుకున్న వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9490219717 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాయితీ ధరపై అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ

కె.కోటపాడు : ఏపీఈపీడీసీఎల్ గ్రామ గృహ విద్యుత్ వినియోగదారులకు 50శాతం రాయితీ చార్జీలపై అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు కె.కోటపాడు విద్యుత్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. కె.కోటపాడులో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాయితీపై 1 కిలోవాట్‌కు రూ.1250, రెండు కిలోవాట్‌లకు రూ.2450, మూడు కిలో వాట్‌లకు రూ.3650, నాలుగు కిలో వాట్‌లకు రూ.4850, ఐదు కిలో వాట్‌లకు రూ.6050 చెల్లిస్తే సరిపోతుందని అన్నారు. అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ చేయదలచుకున్న వినియోగదారులు విద్యుత్ కార్యాలయాల్లోను, మీ సేవా కేంద్రాల్లోను సంబంధిత వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గాదిరాయిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఏడు రోజులుగా గ్రామంలో విద్యుత్ సమస్య

మాడుగుల : మండలంలో గాదిరాయి గ్రామంలో వారం రోజుల క్రితం ఈదురుగాలులకు సుమారు ఐదు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో గ్రామంలో కొంత భాగానికి విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయని గ్రామస్తులు చెబుతున్నారు. మంచి నీటి పథకానికి కూడా సక్రమంగా విద్యుత్ అందలేదని, ట్రాన్స్ కో అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రాంబాబును సంప్రదించగా ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం వాస్తవమేనని, అయితే అప్పట్లోనే తాత్కాలికంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం జరిగిందన్నారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి శాశ్వతంగా విద్యుత్ సరఫరా అందజేస్తామన్నారు.



ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మహిళల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి

రావికమతం : కొత్తకోటలో బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచి తద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. మహిళల్లో ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి, ఆత్మగౌరవం పెంచేందుకు కుట్టు శిక్షణ ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, బీసీ కార్పొరేషన్ అధికారులు, కూటమి నాయుకులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాజు తెలిపారు. శనివారం మేజర్ పంచాయతీ వడ్డాది, మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఆయన అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. కుట్టు శిక్షణ పూర్తయిన తరవాత ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తారన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీపీ నాగేశ్వరిదేవి నాయకులు జి.సత్యనారాయణ, తమరాన దాసు, దొండా నరేష్, గిరిబాబు, నానాజీ పాల్గొన్నారు.



కొత్తకోటలో కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షణలు నిర్వహించి, కానుకలు, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో ఆసనాలు వేయిస్తున్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాంబశివరావు

నర్సీపట్నం : విద్యార్థి దశ నుంచే యోగాలో తర్ఫీదు పొందితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని గ్రంథాలయ అధికారి పి.దమయంతి పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు నీతి కథలతో పాటు యోగా గురించి వివరించారు. విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు పి.ప్రభాకర్ పలు ఆసనాలు విద్యార్థులతో వేయించారు. ఆసనాలు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిదినం యోగా చేయడం వల్ల చదువులో కూడా చురుగ్గా ఉంటారన్నారు.

కె.కోటపాడు : విద్యార్థులకు యోగాతో ఆరోగ్యంతో పాటు చదువులపై ఏకాగ్రత పెరుగుతుందని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంపై శనివారం పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయిలో యోగా కార్యక్రమం కోసం మండలానికి చెందిన ఐదుగురు శిక్షణ పొందుతున్నట్టు తెలిపారు. వీరు ఈ నెల 25 నుంచి జూన్ 21 వరకూ గ్రామాల్లో గల సచివాలయాల్లో యోగ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, ఈవోఆర్డీ రమణి, ఎంఈవో ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలు కొనసాగించాలి

దేవరాపల్లి: ఎండీయూ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే రేషన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని ఏపీ రాష్ట్ర సమైక్య ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి మండల ఎండీయూ ఆపరేటర్లు శనివారం వినతి పత్రం అందజేశారు. 2027 జనవరి వరకు ప్రభుత్వంతో తమ అగ్రిమెంట్ ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను అర్థంతరంగా రద్దు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ఎండీయూ ఆపరేటర్లు, సహాయకుల కుటుంబాలు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీయూ వ్యవస్థ ద్వారా కచ్చితమైన తూకంతో పాటు ఇంటి వద్దనే పేద ప్రజలు రేషన్ అందుకుంటున్నారని, ఈ విధానాన్ని రద్దు చేయడంతో మరలా రేషన్ కోసం కాలినడకన వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. అగ్రిమెంట్ ప్రకారం 2027 వరకు కొనసాగించాలని, లేకుంటే అగ్రిమెంట్ ప్రకారం 20 నెలలకు సంబంధించి మొత్తం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



దేవరాపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

రైస్ బళ్లు నిలిపివేయడం సరికాదు



కాళ్ల రాము

మాడుగుల : ఇంటింటికీ బియ్యం పంపిణీ చేసే వాహనాలు తీసేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ సహకార సంఘ అధ్యక్షుడు కాళ్ల రాము అన్నారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఇంటింటికీ రేషన్ బండి ఉండడం వల్ల రేషన్ డీలరుకు ఎటువంటి నష్టం లేదన్నారు. గ్రామాల్లో వృద్ధులు తమ ఇంటి వద్దే బియ్యం తీసుకునేవారని గుర్తు చేశారు. రేషన్ బండి నిలిపివేయడం వల్ల వందలాది మంది ఉపాధి కోల్పోతారని అన్నారు. రాజకీయ కోణంలో ఆలోచించి ఎండీయూ వ్యవస్థను తొలగించడం సరి కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, వారిచ్చిన హామీలు అమలు చేయకపోగా గత ప్రభుత్వంలో పేదలను ఆదుకునే పథకాలు తొలగించడం బాధాకరమన్నారు.

మోదమాంబను దర్శించుకున్న 'సుంకర'

మాడుగుల రూరల్ : పాడేరు మోదమాంబ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు శనివారం దర్శించుకున్నారు. నియోజకవర్గ పరిధి చీడికాడ మండలం, ఖండివరం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.